క్లుప్తంగా

నేడు ఎంపీ లక్ష్మణ్ రాక

నల్లగొండ టూటౌన్ : బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ శనివారం నల్లగొండ పట్టణానికి రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నల్లగొండ పట్టణానికి చేరుకుని కుల గణనపై స్థానికంగా నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

గుండ్రాంపల్లి పాల సంఘం చైర్‌పర్సన్‌గా శారద

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార మహిళా సంఘం చైర్మన్, డైరెక్టర్ల ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘం చైర్‌పర్సన్‌గా బత్తుల శారద, డైరెక్టర్లుగా పోల్‌రెడ్డి శైలజ, అచ్చిన అంజమ్మలు ఎన్నికయ్యారు. వెలిమినేడు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లుగా కొంపెల్లి వెంకటేష్‌గౌడ్, నోముల కళమ్మ ఎన్నికయ్యారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కట్టంగూర్ : భూ భారతిలో వచ్చిన రైతుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలో ఆర్డీఓ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు పబ్బు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల సమస్యలపై అనేక ఫిర్యాదులు వచ్చినా బీఆర్ఎస్ పాలనలో పరిష్కరించలేదని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు, గంజి ఆంజనేయులు, నాగచైతన్య ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కట్టంగూర్ : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ అస్రా అంజుమ్ అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, అరుణశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, అమృతమ్మ ఉన్నారు.

నీరా పరిశ్రమ ఏర్పాటు చేయాలి

చండూరు: మునుగోడు నియోజకవర్గంలో నీరా పరిశ్రమ ఏర్పాటు చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరాస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరులోని మాదగోని నర్సింహ భవన్‌లో జరిగిన గీత పనివారల సంఘం 15వ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గీత వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం రూ.1000 కోట్ల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాటి, ఈత వనాలపై సొసైటీలకు చెట్టు పట్టా, ద్విచక్ర వాహనాలు, గీత కార్మికులకు చెట్లు ఎక్కేందుకు సేఫ్టీ యంత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, నలపరాజు రామలింగయ్య, నలపరాజు సతీష్, పల్లె శంకర్, బొడ్డు వెంకన్న, గంట నగేష్, బరిగల వెంకటేష్, బండమీది వెంకన్న, సత్తయ్య, నవీన్, నరసింహ, అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

‘హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్’

నాంపల్లి : కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు పూల వెంకటయ్య అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి తరలివెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్మికులకు నెలకు రూ.26వేల జీతం, అన్ని రకాల వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాదెపాక రాములమ్మ, మరియమ్మ, ఎదుళ్ల రాములమ్మ, ఈరమ్మ, సులోచన, చందమ్మ, వెంకటమ్మ, తేజ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించాలి

నల్లగొండ టౌన్ : రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ డీవైఎఫ్ఐ కార్యదర్శి మల్లం మహేష్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఓ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, కట్ట లింగస్వామి, ఎండీ అక్రమ్, మహేష్, పాలాది కార్తీక్, అంజి, గోపికృష్ణ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నకిరేకల్: పట్టణంలోని కాటమయ్య బజార్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాటమయ్య బజార్‌లోని అయోధ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కొండ ధనలక్ష్మి గత మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్దకు వెళ్లింది. గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. వంట గదిలో డబ్బాలో దాచిపెట్టిన తులంన్నర బంగారు గొలుసు, 30 తులాల వెండి ఆభరణాలను అపహరించారు. ఆ ఇంటి పక్కనే ఉంటున్న ధనలక్ష్మి తల్లి తన కుమార్తె ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి సమాచారం అందజేసింది. ఈమేరకు ధనలక్ష్మి శుక్రవారం పోలీసులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వానాకాలం వరిసాగు కష్టమే!

- అడుగంటిన భూగర్భ జలాలు
- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- ఆందోళనలో అన్నదాతలు



నీరు లేక వెలవెలబోతున్న కొంపల్లి పెద్ద చెరువు

మునుగోడు: ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమై దాదాపు నెల రోజులు కావొస్తున్నా ఒక్కసారి కూడా భారీ వర్షం కురవకపోవడంతో మునుగోడు మండల వ్యాప్తంగా వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది కూడా అంతంత మాత్రంగా వర్షాలు కురవడంతో మునుగోడు మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో భూగర్భ జలాలు భారీగా పడిపోయి గత యాసంగి సీజన్‌లో అనేక మంది రైతుల వరి పంట పొలాలు ఎండిపోయాయి. ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైనప్పటికీ భారీ వర్షాలు కురవకపోవడంతో రైతుల వ్యవసాయ బోర్లు అడుగంటి కేవలం నారుమడికి సరిపోను నీటిని మాత్రమే అందిస్తున్నాయి. మరికొందరు రైతుల బోర్లు కనీసం నారుమడికి సరిపడా నీళ్లు పోయడం లేదు. భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి తమ బోర్లలో నీరు పెరిగితే వరి పంట సాగుచేసుకుందామనే ఆశతో అనేకమంది రైతులు తమ పొలాల్లో వరినారు పోసుకుని సిద్ధంగా ఉన్నారు.

సగానికిపైగా ఎండిపోయిన బోర్లు..

మునుగోడు మండలవ్యాప్తంగా ఉన్న 27 గ్రామ పంచాయతీల్లో దాదాపు 15వేల మంది రైతులు ఎకరం, రెండెకరాల చొప్పున ప్రతి ఏటా దాదాపు 8 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేస్తున్నారు. ఎలాంటి సాగు నీటి వనరులు లేకపోవడంతో పూర్తిగా విద్యుత్ మోటార్లపై ఆధారపడి వరి పంట సాగుచేస్తున్నారు. మండల వ్యాప్తంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో 8600 బోర్లు వేసుకుని వరిసాగు చేస్తున్నారు. అయితే గత ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి గత యాసంగి సీజన్‌లో దాదాపు సగానికిపైగా పొలాలు ఎండిపోయాయి.

26 గ్రామాల్లో 112 చెరువులు, కుంటలు..

ఈ ఏడాది భారీ వర్షాలు కురవకపోవడంతో మునుగోడు మండలంలోని చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 112 చెరువులు, కుంటలు ఉండగా అందులో 9 పెద్ద చెరువులు 103 కుంటలు ఉన్నాయి. వాటితోపాటు ప్రధాన నీటి వనరు అయిన మునుగోడు పెద్ద వాగును ఆనుకుని ఉన్న 10 గ్రామాల్లో బోర్ల ద్వారా దాదాపు 2 వేల ఎకరాల వరిసాగు చేస్తారు. కానీ వాగు పారక ఆ వాగు వెంట ఉన్న వ్యవసాయ బోర్లు దాదాపు 80 శాతానికిపైగా ఎండిపోయాయి.

నారుమడికి కూడా నీళ్లు లేవు



నాకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగు ఎకరాల తరి పొలాన్ని వరి సాగు చేసేందుకు కౌలుకు తీసుకున్నా. కానీ గత ఏడాది సరిగా వర్షాలు కురవకపోవడంతో గత యాసంగిలో దాదాపు సగం పంట ఎండిపోయింది. ఈ ఏడాది ఒక్కసారి కూడా భారీ వర్షం కురవకపోవడంతో బోరులో నీరు బాగా తగ్గిపోయింది. కనీసం నారుమడి పోసుకునేందుకు అవసరమైన నీళ్లు కూడా పోయడం లేదు.

– శిరగమళ్ల వెంకన్న, రైతు చీకటిమామిడి

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



మర్రిగూడ: యరగండ్లపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ లూజ్ వైర్లు గృహాలకు దగ్గరగా ఉండడంతో వాటిని వెంటనే మార్చాలని విద్యుత్ ఏఈకి సూచించారు. గ్రామాల్లో పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైన్లను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని అర్హులు అధైర్య పడవద్దని రెండో విడతలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీని నిర్మించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ జెడ్పీటీసీలు మేతరి యాదయ్య, పాశం సురేందర్ రెడ్డి, మాడెం వెంకటయ్య, పులిమామిడి నరసింహారెడ్డి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, కుక్కడపు ముత్యాలుగౌడ్, జంగిలి రవి, గ్యార వెంకటేష్, అబ్రహం, అయితగోని వెంకటయ్య, మేతరి శంకర్, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

మునుగోడు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదే అన్నారు. వైద్యులు 24 గంటలు ఆస్పత్రిలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. గర్భిణుల ప్రసూతిలు నూరుశాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్ఓ మనోహర్, నల్లగొండ డిప్యూటీ డీఎంహెచ్ఓలు వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణచక్రవర్తి, ఆరు మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.



మునుగోడు: వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఎంపీడీఓను సన్మానించిన ఎమ్మెల్యే

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను మునుగోడు మండల వ్యాప్తంగా పూర్తిగా నిషేధించేందుకు కృషి చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఈ.విజయభాస్కర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు కలిగించే వస్తువులను ప్రజలు వినియోగించవద్దన్నారు. పర్యావరణవేత్త సురేష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పాల్వాయి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



నల్లగొండ పట్టణంలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): జగన్నాథ రథయాత్ర నల్లగొండ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తి వేదాంత ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శివాజీనగర్ టీటీడీ కల్యాణ మండలం నుంచి ప్రారంభమైన రథయాత్ర రామగిరి, క్లాక్ టవర్, ఎన్జీ కాలేజీ మీదుగా శివాజీనగర్ వరకు కొనసాగింది. హరే కృష్ణ హరే రామ నినాదాలతో భక్తుల భజనలు చేశారు. కార్యక్రమంలో పరమహంస దాస్, అనంత పద్మనాభం, రాధామాధవ్‌దాస్, అశోక్, మన్మోహన్, సత్తయ్య, గోవింద శ్యామ్, ప్రతాప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

‘మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు’

చండూరు: మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీంతో చండూరు మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతోందని వినియోగదారుల హక్కుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎరుకల హిమగిరి అన్నారు. చండూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చండూరు మున్సిపాలిటీలో దాదాపు 200 ఇళ్లు అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, ఇప్పటికే నిర్మించిన వ్యాపార సముదాయాల నుంచి సరైన పన్నులు వసూలు చేయడం లేదని అన్నారు. ఈవిషయమై మార్చి 15న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా మున్సిపల్ అధికారులు స్పందించడంలేదన్నారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, నోముల శంకర్‌యాదవ్, మైనం యుగందర్, లింగస్వామి తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్: ఈ నెల 28 నుంచి జూలై 6 వరకు జరుగనున్న మొహరం వేడుకలకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ నల్లగొండ పట్టణ ఆవాజ్ కమిటీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. వీధిలైట్లు వేయడంతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, మోహిజ్ తాహెర్, దండెంపల్లి సత్తయ్య, ఎండీ.ఖదీర్‌ఖాన్, షోను, ఎండీ.అర్బజ్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకుంటాం.. విధులకు అడ్డు రాకండి



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

చిట్యాల: డ్రగ్స్ వినియోగదారులు, విక్రయదారులతోపాటు అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిపై చర్యలు తీసుకుంటామని, ఆ సందర్భాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ విధులకు అడ్డరావొద్దని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు అన్నారు. చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా అఖిల పక్ష నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి పది గంటల తరువాత అనవసరంగా బయట తిరిగిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారితోపాటు నిరంతరాయంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై, సోషల్ మీడియాలో మహిళల, యువతుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడేవారిని రక్షించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయబోమని, వారి తరపున పోలీస్‌స్టేషన్‌కు రాబోమని హామీఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణనాయక్, ఎస్ఐ అఫ్రీన్ నసీహా, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శేపూరి రవీందర్, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు జడల చినమల్లయ్య, పొన్నం లక్ష్మయ్యగౌడ్, గుండాల నరేష్‌గౌడ్, సీపీఎం కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, సంజయ్‌దాస్‌గౌడ్, మహాలింగం, నాయకులు బెల్లి సత్తయ్య, మారగోని ఆంజనేయులుగౌడ్, ఇబ్రహీం, చెర్కుపల్లి శ్రీశైలం, బొబ్బల రాంరెడ్డి, ఆగు అశోక్ పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

చిట్యాల: పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. బార్ అండ్ రెస్టారెంట్‌లోని వంట గదితోపాటు, మూత్రశాలల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మున్సిపల్ అధికారులు రెండు వేల రూపాయల జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్, వార్డు ఆఫీసర్ సురేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై ఫిర్యాదు

చిట్యాల పట్టణంలో నిర్వహిస్తున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల్లో నాణ్యత లేదని, బార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనుకు ఫిర్యాదు చేశారు. ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, మూత్రశాలల నిర్వహణ సరిగ్గా లేదని, అపరిశుభ్ర వాతావరణంలో బార్ నిర్వహణ జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, చికిలంమెట్ల అశోక్, మహాలింగం పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్‌పై విద్యార్థినులకు అవగాహన



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థినులు

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం ఎన్నికల పోలింగ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కౌన్సిల్ లీడర్ ఎన్నికను ఓటింగ్ పద్ధతిన నిర్వహించారు. విద్యార్థినులు క్యూలో నిల్చుని ఓటు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘గీత’ సంక్షేమానికి కృషి

చిట్యాల: కల్లు గీత వృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తామని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జనగాం రవీందర్‌గౌడ్ అన్నారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన సుమలతను సంఘం సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమించి ఉత్తర్వుల కాపీ అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సంఘానికి సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మారగోని ఆంజనేయులుగౌడ్, గిలకత్తుల రమేష్‌గౌడ్, కప్పల రవికుమార్‌గౌడ్, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కాసుల సత్యనారాయణగౌడ్, మండల గౌరవాధ్యక్షుడు పుల్లెంల కోటయ్య, మండల అధ్యక్షుడు పంతంగి వెంకన్నగౌడ్, ప్రధానకార్యదర్శి బుడ్డు శంకర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఉయ్యాల మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై వీడియో విడుదల



వీడియోను విడుదల చేస్తున్న ఎస్పీ

నల్లగొండ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా నల్లగొండ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రూపొందించిన వీడియోను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు–జీవితం ముద్దు ప్రోమోను వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ తరపున తయారు చేయడం అభినందనీయమన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మాదకద్రవ్యాలు సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీడియో జర్నలిస్టు అల్లి మల్లికార్జున్, శ్రీనివాస్ గౌడ్, రవి, రఘు, వెంకన్న, సలీం, జనార్దన్, బాలు, కుశలచారి, వెంకన్న, రాజు, మధు, శంకర్, రమేష్, మధు, రవి వినోద్, కత్తులహరి కారింగు శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గౌరవ వందనం చేస్తున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): పాఠశాల దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ హృదయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, బ్రదర్ బాలఇన్నా, బ్రదర్ సెబాస్టియన్, నర్సిరెడ్డి, స్వర్షన్, సుందరి, లూర్దురెడ్డి, జయంత్, రాజు, ఆంబ్రోస్, లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, పాఠశాల యాజమాన్యం

• పొంచి ఉన్న ప్రమాదం



చిట్యాల పట్టణంలోని 12వ వార్డులో గల హోమియోపతి ఆస్పత్రిలో విద్యుత్ తీగలను పీవీసీ పైపుల ద్వారా ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల ఈ తీగల పైపులు సీలింగ్ గోడల నుంచి ఊడిపోయి వేలాడుతున్నాయి. ఈ ఆస్పత్రిలో ప్రతి బుధవారం చిన్నారులకు టీకాలు వేస్తున్నారు. గది మధ్యలో విద్యుత్ తీగల పైపులు వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. - చిట్యాల

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి : కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జూలై 9 నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సీపీఐ (ఎం) శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు రాచకొండ వెంకన్న, జిట్టా నగేష్, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, చింతపల్లి బయన్న, చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, దండు రవి, నాగరాజు, అయిలయ్య, జాల యాదమ్మ, రామచంద్రం, కల్లూరి కంఠం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి పంపకపోతే పింఛన్ కట్

- మాధారంకలాన్‌లో దండోరా వేయించిన ఓ నాయకుడు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

శాలిగౌరారం: ‘రేపు పొద్దడికి సర్కాకు బడికి గామంలోని పిల్లలందరిని తోలాలే.. ప్రైవేట్ బడిలోకి పంపితే.. పింఛన్లు బంద్.. రేషన్‌కార్డు, బియ్యం కూడా బందే.. పంచాయతీ బోర్డు నుంచి చెప్పబడిందయ్యో...’ ఇది శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో ఓ నాయకుడు బుధవారం రాత్రి వేయించిన డప్పు దండోరా. అయితే డప్పు దండోరాను వీడియో తీసిన గ్రామానికి చెందిన కొందరు గురువారం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడంతో ఆ వీడియో వైరల్‌గా మారింది. వీడియోపై ఆరా తీసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఘటనపై నివేదిక ఇవ్వాలని శాలిగౌరారం ఎంపీడీఓ జ్యోతిలక్ష్మిని ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సదరు నాయకుడిని విచారించగా ప్రభుత్వ బడిని కాపాడుకోవాలనే డప్పు దండోరా చేయించాను తప్ప ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను నిలిపివేయాలనే ఉద్దేశం తనకు లేదని వివరణ ఇచ్చాడు. డప్పు దండోరా తన వ్యక్తిగతమే కానీ గ్రామపంచాయతీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. తాను సర్కారు బడికి గ్రామంలోని మన పిల్లలను పంపాలని చెబితే దండోరా వేసే వ్యక్తి వృద్ధుడు కావడంతో పంచాయతీ బోర్డు అనే పదాన్ని వాడారంటూ ఎంపీడీఓకు ఆ నాయకుడు వివరణ లేఖ రాసి ఇచ్చాడు.